# తౌహీద్ (దైవ ఏకత్వ) స్థాపన నేపథ్యంలో
# హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర విశ్వాసభరిత ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 27.03.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రే) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి జీవిత చరిత్రలో దైవ ఏకత్వం గురించి ప్రస్తావన జరుగు తుండెను. మక్కా విజయం సమయంలో విగ్రహాలను కూల్చివేసిన వివరాలు గత ఖుత్బాలలో వివరించబడ్డాయి. ఇదంతా వారు సల్లల్లాహు అలైహి వసల్లం దైవ ఏకత్వ ప్రకటనగా చేశారు. అనగా మీరు (అనగా మక్కా ప్రజలు) ఏ విగ్రహాలనైతే ఆరాధిస్తున్నారో వాటి అసలు స్థితి ఇది అని నిరూపించారు. తాఇఫ్ ప్రజల విగ్రహమైన లాత్ గురించి ఒక కథనం ఇట్లు లభిస్తున్నది. ఆ విగ్రహాన్ని మూడు సంవత్సరాల వరకు కూల్చవద్దని వారు అభ్యర్థించారు. కానీ దైవ ఏకత్వం పట్ల పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఉన్న రోషం ఈ రాజీని అంగీకరించలేదు. తాఇఫ్ ప్రజలు కనీసం ఒక సంవత్సరం, ఆ తర్వాత ఒక నెల వరకు అయినా ఆ విగ్రహాన్ని తొలగించవద్దని సిఫార్సు చేశారు. కానీ వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఈ అభ్యర్థనను కూడా తిరస్కరించి, ఆ విగ్రహాన్ని కూల్చివేయించారు.

హుజూరె అన్వర్ ఇట్లు ఉపదేశించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కేవలం మక్కా అన్యారాధుల తో పోరాడి పవిత్ర కాబాను విగ్రహాల నుండి శుద్ధి చేయడమే కాకుండా, ముస్లింల హృదయాలలో కూడా దైవ ఏకత్వాన్ని బలంగా నాటారు. వారు సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులకు ఎంతటి ఉన్నతమైన శిక్షణ ఇచ్చారంటే వారి హృదయాలలో బహుదైవారాధన గురించిన ఆలోచన కూడా కలగకుండా చేశారు.

హజ్రత్ ఇబ్నే అబ్బాస్ రజియల్లాహు అన్హు కథనం ప్రకారం, హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు మింబర్ (ప్రసంగ వేదిక) పై ఇలా అనడం ఆయన విన్నారు. మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రవచించగా నేను విన్నాను. క్రైస్తవులు యేసు క్రీస్తు విషయంలో అతిశయోక్తి చేసినట్లు నా విషయంలో మీరు అతిశయోక్తి చేయకండి. నేను కేవలం అల్లాహ్ దాసున్ని మాత్రమే. కావున మీరు నన్ను అల్లాహ్ దాసునిగా మరియు అతని ప్రవక్త అని పిలవండి.

ఒక సందర్భంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. మీరు మీ తాత ముత్తాతల పేరిట ప్రమాణాలు చేయడాన్ని అల్లాహ్ నిషేధించాడు. ఎవరైనా ప్రమాణం చేయాలనుకుంటే అల్లాహ్ పేరు మీద ప్రమాణం చేయవలెను లేదా మౌనంగా ఉండవలెను. దైవ ఏకత్వానికి పోటీగా దేనినైనా కొంచెం కూడా సమానంగా ఉంచడాన్ని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సహించేవారు కాదు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఒక అనుచరుడు ఇలా అడిగాడు. యుద్ధంలో శత్రువు నా

చేతిని నరికివేసి ఆ వెంటనే కలిమా చదివి ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రకటిస్తే నేను అతడిని చంపవచ్చా? దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. వద్దు, అతడిని చంపవద్దు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరింత వివరణ ఇస్తూ ఇలా అన్నారు. అతడు కలిమా చదివిన తర్వాత కూడా నువ్వు అతడిని చంపితే, అతడు (కలిమా కారణంగా) నీకంటే మెరుగైన స్థితికి చేరుకుంటాడు మరియు నువ్వు అతడి పూర్వపు (చెడు) స్థితికి చేరుకుంటావు.

హుజూరె అన్వర్ ఇట్లు ఉపదేశించారు. ఆరంభ అనుచరులలో కూడా ఎవరైనా ఇటువంటి పని (కలిమా చదివిన వారిని చంపడం వంటివి) చేస్తే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దానిని తీవ్రంగా ఖండించారు. కానీ నేటి కాలపు ముస్లిం పండితుల పరిస్థితి చూడండి. పాకిస్తాన్‌లో అహ్మదీలు కలిమా చదివినప్పటికీ వారిపై జరుగుతున్న అరాచకాలకు అంతం లేదు. అన్యాయం చేసే ఇటువంటి వ్యక్తుల తీర్పును దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ కథనం ద్వారా ముందే తెలియజేశారు. ఏది ఏమైనా ఆ దేశంలోని తీవ్రవాద మౌల్వీల వెనుక నడిచే ప్రజలు ఇప్పుడు ఆలోచించాల్సిన అవసరముంది.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రవచించారు. మీ విషయంలో నేను అత్యధికంగా భయపడేది చిన్న షిర్క్ అనగా లోక ప్రదర్శన. ప్రళయ దినమున ప్రజలకు వారి కర్మానుసారం ప్రతిఫలం ఇచ్చే టప్పుడు అల్లాహ్ తఆలా ఈ లోక ప్రదర్శకులతో ఇలా అంటాడు. మీరు ప్రపంచంలో ఎవరిని మెప్పించడానికి ప్రదర్శనలు చేశారో వారి దగ్గరికే వెళ్ళండి! వారి వద్ద మీకు ఏదైనా ప్రతిఫలం లభిస్తుందేమో! అక్కడికి వెళ్ళి చూడండి!

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంకా ఇట్లు ప్రవచించారు. అల్లాహ్ తఆలా ఇలా ప్రకటిస్తున్నాడు. ఆదం కుమారుడు (మనుష్యుడు) నన్ను ధిక్కరిస్తున్నాడు మరియు నా గౌరవానికి భంగం కలిగిస్తున్నాడు, ఇది అతడికి ఏమాత్రం తగదు. అతడు నన్ను ధిక్కరించడం అంటే, మరణానంతరం పరలోకంలో తిరిగి మరల పుట్టించుటను (పునర్జన్మను) తిరస్కరించడమే. నిజానికి అల్లాహ్ తఆలా అతడిని మొదటిసారి ఎలా సృష్టించాడో, అదే విధంగా రెండోసారి సృష్టించడం కూడా అతనికి చాలా సులభం. ఇక నా గౌరవానికి భంగం కలిగించడం అంటే అల్లాహ్‌కు సంతానం ఉందని విశ్వసించడం. కానీ అల్లాహ్ తఆలా అన్ని రకాల అవసరాల నుండి విముక్తుడు, నిరపేక్షుడు మరియు వంటరివాడు.

ఇఖ్లాస్ అధ్యాయాన్ని వివరిస్తూ హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఒక చోట ఇలా ఉపదేశించారు. అల్లాహ్ ఎటువంటి అస్తిత్వం అనగా అందరూ అతనిపైనే ఆధారపడతారు. కానీ ఆయన ఎవరిపైనా ఆధారపడడు. ఒక్క వరుసలో కూడా లేని ఈ చిన్న వాక్యాన్ని చూడండి! ఎంతటి సున్నితత్వంతో మరియు గొప్పతనంతో దేవుని అస్తిత్వం అన్ని రకాల భాగస్వామ్యాల నుండి పరిశుద్ధమైనదని వివరించబడింది.

హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇఖ్లాస్ అధ్యాయాన్ని పవిత్ర ఖుర్ఆన్‌లో మూడవ వంతుగా ప్రకటించారు. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) దీని గురించి వివరిస్తూ దీని అర్థం ఈ అధ్యాయంలోని అంశం అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉందని అర్థం. పవిత్ర ఖుర్ఆన్ మరియు హదీసుల అధ్యయనం ద్వారా తెలిసేదేమనగా చివరి కాలంలో రెండు పెద్ద పెద్ద ఉపద్రవాలు తలెత్తుతాయి. ఒకటి దజ్జాల్ ఉపద్రవం. రెండవది యాజూజ్ మాజూజ్ ఉపద్రవం. ఈ రెండు ఉపద్రవాలు ఒకదాని తర్వాత ఒకటి ఇస్లాంతో పోటీపడాల్సి ఉంటుంది. ఒక ఉపద్రవం ఏకైక దేవునికి బదులుగా ముగ్గురు దేవుళ్ల (త్రిత్వము) సిద్ధాంతాన్ని కలిగి ఉంది. అనగా దేవుడు తండ్రి, దేవుడు కుమారుడు మరియు దేవుడు పరిశుద్ధాత్మ. రెండవ ఉపద్రవం నాస్తికత్వం. అనగా అది దేవుడి ఉనికినే పూర్తిగా తిరస్కరిస్తుంది. పవిత్ర ఖుర్ఆన్ ఈ రెండు ఉపద్రవాల నమ్మకాలను ఖండించింది. పవిత్ర ఖుర్ఆన్ కేవలం దేవుడు తండ్రి

(అంటే ఏకైక దేవుని) దైవత్వాన్ని మాత్రమే స్థాపించింది. కానీ దేవుడు కుమారుడు, పరిశుద్ధాత్మ భావనలను కఠినంగా తిరస్కరించింది. అనగా పవిత్ర ఖుర్ఆన్ ఆ ముగ్గురు దేవుళ్లలో కేవలం ఒక్కరిని అనగా ఏకైక అద్వితీయ దేవుని నిజమైన దైవత్వాన్ని స్థాపించింది. కావున దేవుడు తండ్రిని సమర్థించడం పవిత్ర ఖుర్ఆన్‌లోని మూడవ వంతు అంశం. అందుకే ఇఖ్లాస్ అధ్యాయం పవిత్ర ఖుర్ఆన్‌లో మూడవ వంతు అవుతుంది.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లు ఉపదేశించారు. నిశ్చయమైన దైవ ఏకత్వం కేవలం ఒక ప్రవక్త ద్వారానే లభిస్తుంది. అనగా మన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అరబ్ నాస్తికులకు, దుర్మార్గులకు వేలాది ఆకాశ సంకేతాలను చూపించి, వారిని దేవుని ఉనికిని అంగీకరించేలా చేసినట్లుగానే ఇది సాధ్యమవుతుంది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నేటి కాలంలో ఒకవైపు యాజూజ్ మాజూజ్ మరియు దజ్జాల్ ప్రభావం తలెత్తగా మరోవైపు స్వయంగా ముస్లింలలో కూడా అసలైన దైవ ఏకత్వం పట్ల అవగాహన లోపించింది. అందుకే ఈ కాలంలో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి దాసులైన మసీహ్ మౌఊద్ మరియు మెహదీ మౌఊద్ అవతరించవలసి ఉంది. ఆయన అలైహిస్సలాం అవతరించారు మరియు దైవ ఏకత్వంపై జరిగిన ప్రతి దాడిని సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. కావున మనం నిజమైన దైవ ఏకత్వాని విశ్వసించినప్పుడే అసలైన బైఅత్ ప్రతిజ్ఞ హక్కును నెరవేర్చగలము.

దైవ ఏకత్వ అత్యున్నత స్థాయి గురించి ఒకసారి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రవచించారు. హజ్రత్ మూసా అలైహిస్సలాం దేవుణ్ణి ఇలా వేడుకున్నారు. ఓ అల్లాహ్! నేను నిన్ను స్మరించడానికి మరియు నిన్ను ప్రార్థించడానికి నాకు ఏదైనా ఒక విషయాన్ని నేర్పించు. అప్పుడు అల్లాహ్ తఆలా ఇలా అన్నాడు. ఓ మూసా! లా ఇలాహ ఇల్లల్లాహ్ అని చెప్పు. అందుకు మూసా అలైహిస్సలాం ఇలా అన్నారు. ఓ అల్లాహ్! నీ దాసులందరూ ఇదే స్మరిస్తారు కదా! అప్పుడు దేవుడు మళ్ళీ అదే కల్మాను చెప్పమని ఆదేశించాడు. హజ్రత్ మూసా అలైహిస్సలాం పట్టుబట్టగా అల్లాహ్ తఆలా ఇలా ఆదేశించాడు. ఓ మూసా! ఒకవేళ నేను తప్ప ఈ ప్రపంచంలోని వస్తువులన్నీ మరియు ఏడు భూములు ఒక త్రాసు పళ్ళెంలో ఉంచి రెండో పళ్ళెంలో లా ఇలాహ ఇల్లల్లాహ్‌ను ఉంచితే లా ఇలాహ ఇల్లల్లాహ్ అన్నింటికంటే ఎక్కువ బరువుగా ఉంటుంది.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఒక చోట ఇలా ప్రవచింవిచారు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధనల ప్రకారం లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్రసూలుల్లాహ్ అని పఠించడం వల్ల పాపాలు తొలగిపోతాయి. ఇది ముమ్మాటికీ నిజం మరియు వాస్తవం. ఎవరైతే అల్లాహ్‌ను అద్వితీయుడైన ఏకైక దేవుడిగా నమ్ముతారో మరియు హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లంను ఆ సర్వశక్తిమంతుడైన దేవుడే పంపాడని విశ్వసిస్తారో నిశ్చయంగా వారి అంతిమ శ్వాస ఈ కల్మాపైనే ఉన్నచో వారు తప్పక మోక్షాన్ని పొందుతారు.

ఒక సందర్భంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించారు. అల్లాహ్ తప్ప మరెవరూ ఆరాధ్యులు లేరు, అతడు ఒక్కడే అతనికి ఎవరూ భాగస్వాములు లేరని మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అతని దాసుడు అని మరియు అతని ప్రవక్త అని ఎవరైతే సాక్ష్యమిస్తారో ఇలాగే ఈసా (అలైహిస్సలాం) అల్లాహ్ దాసుడు మరియు అతని దాసి కుమారుడు మరియు అల్లాహ్ మరియమ్మ వైపు పంపిన ఒక వాక్కు (కలిమా) మరియు అతని తరపున ఒక ఆత్మ అని ఇలాగే స్వర్గం సత్యం మరియు నరకం సత్యం అని ఎవరైతే సాక్ష్యమిస్తారో ఇటువంటి వ్యక్తులను అల్లాహ్ తఆలా స్వర్గంలోని ఎనిమిది ద్వారాలలో దేని నుండి అయినా తన ఇష్టానుసారం ప్రవేశింపజేస్తాడు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతి సందర్భం లోనూ దైవ ఏకత్వం గురించి వివరించారు మరియు దానిని ముస్లిం సమాజం హృదయాలలో నాటడానికి

ప్రయత్నించారు. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారికి అల్లాహ్ గొప్పతనాన్ని చాటిచెప్పాలనే ఉత్సాహం ఎంతగా ఉండేదంటే, శత్రువులు కూడా దానిని అంగీకరించేవారు. ఒక ఫ్రెంచ్ చరిత్రకారుడు కూడా ఇలా వ్రాశాడు. ప్రవక్తగా ప్రకటించినప్పటి నుండి మరణం వరకు దైవ ప్రవక్త నాలుకపై ఎప్పుడూ అల్లాహ్ స్మరణే ఉండేది. అనగా వారి జీవిత ఆశయం కేవలం అల్లాహ్ ఉనికిని ప్రపంచం గుర్తించేలా చేయడమే.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఒక చోట ఇలా ఉపదేశించారు. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి గౌరవం ఎంత ఉన్నతమైనదైనా మరియు మనకు వారిపై ఎంతటి ప్రేమ ఉన్నా సరే అల్లాహ్ తఆలా గొప్పతనం మాత్రం పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గౌరవం కంటే చాలా ఉన్నతమైనదని గుర్తుంచుకోవలెను. దేవుడు అనాది మరియు అనంతమైనవాడు మరియు దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దైవ కరుణాకటాక్షాలలో ఒక గొప్ప భాగం. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నకు అల్లాహ్ తఆలా హోదాను కల్పించడం లేదా అల్లాహ్ తఆలా స్థానాన్ని తగ్గించేలా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను గౌరవించడం ఆయన సల్లల్లాహు అలైహి వసల్లంతో ద్రోహం చేసినట్లే అవుతుంది.

మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారికి దైవ ఏకత్వ స్థాపన పట్ల ఎంతటి ఆవేదన ఉండేదనగా జీవిత చివరి క్షణాల్లో కూడా వారి నోటి నుండి పదే పదే ఈ మాటలు వెలువడ్డాయి. యూదులను మరియు క్రైస్తవులను అల్లాహ్ శపించుగాక! ఎందుకంటే వారు తమ ప్రవక్తల సమాధులను మసీదులుగా (ఆరాధనా స్థలాలుగా) మార్చుకున్నారు. వారు పదేపదే ఇదే విషయాన్ని చెప్పారు. అంటే వారు తమ జాతికి ఇచ్చిన చివరి సలహా మరియు చివరి సందేశం ఏమిటనగా నాకు ఎప్పుడూ బహుదైవారాధన వంటి స్థానాన్ని ఇవ్వకండి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. దైవ ఏకత్వ వాస్తవికతను మనం అర్థం చేసుకోవలెను. దైవ ఏకత్వ స్థాపన కోసం పడిన మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆవేదనను గుర్తించి, దాని కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తూ మనం నిజమైన ఏకేశ్వరవాదులం కావలెను. అల్లాహ్ తఆలా ఇందుకు మనందరిని అనుగ్రహించుగాక! (ఆమీన్)

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇరాన్‌పై యుద్ధం ద్వారా అమెరికా మరియు ఇజ్రాయెల్ ప్రపంచంపై, ముఖ్యంగా ముస్లిం దేశాలపై తమ ఆధిపత్యాన్ని స్థాపించాలని కోరుకుంటున్నాయి. దీనివల్ల పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. ఈ క్రమంలో అరబ్ దేశాలకు కూడా నష్టం జరుగుతుంది. ముస్లింలు ఈ పరిస్థితిని అర్థం చేసుకుని ఐక్యంగా ఉండాలని హుజూరె అన్వర్ హెచ్చరించారు.

ఇంకా హుజూరె అన్వర్ ఇలా ప్రార్థించారు. అల్లాహ్ తఆలా ఈ విషయంలో మనకు దువాలు (ప్రార్థనలు) చేసే భాగ్యాన్ని ప్రసాదించుగాక! ఇస్లామీ దేశాలలో ఐక్యత ఏర్పడుటకు అనుగ్రహించుగాక! (ఆమీన్)

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِی الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔